ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ఉదయం
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 307 | పేజీలు: 5 | వెల: రూ.3/- | ఆదివారం15 ఫిబ్రవరి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# మున్సిపాలిటీలను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం



## మున్సిపల్ ఫలితాలపై పార్టీ నేతలతో సిఎం రేవంత్

గెలిపించిన సీనియర్ మంత్రులకు అభినందనలు

భద్రాద్రి కొత్తగూడెంపై కుదిరిన అవగాహన

మేయర్ సిపిఐకి, డిప్యూటి మేయర్ కాంగ్రెస్‌కు

సిఎం రేవంత్‌తో పల్లా వెంకట్ రెడ్డి భేటీలో నిర్ణయం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ప్రభాత ఉదయం)

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని సిఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. వాటి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. మనపట్ల ప్రజల నమ్మకం పెరిగేలా అభివృద్ధి సాగాలన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నేతలతో సమావేశమయ్యారు.తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ఎన్నికల ఫలితాలపై విశ్లేషణ చేయడమే కాకుండా.. నిజామాబాద్, కొత్తగూడెం కార్పొరేషన్లలో మేయర్ పీఠాలను కైవసం చేసుకునే వ్యూహాలపై దిశానిర్దేశర చేశారు. మంచి ఫలితాలు సాధించారని మంత్రులు, సీనియర్ నేతలను అభినందించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నమ్మకాన్ని కల్పించామన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత ముందుకెళ్లాలన్నారు. సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. ఫలితాలను బేరీజు వేసుకుని మరింతగా పార్టీని పటిష్టం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. హంగ్ అసెంబ్లీలు ఉన్నచోట వాటిని దక్కించుకునేలా వ్యూహాత్మకంగా కదలాలని అన్నారు. ఇందులో మంత్రులు, పిసిసి చీఫ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మంచి ఫలితాలు వచ్చినా, నిజామాబాద్, కొత్తగూడెంలలో మేయర్ పదవులను దక్కించుకోవడంపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. నిజామాబాద్‌లో మేయర్ పీఠం దక్కించుకునేందుకు ఎంఐఎం పార్టీతో చర్చలు జరపాలని పీసీసీ చీఫ్‌కు సీఎం రేవంత్ సూచించారు. కొత్తగూడెంలో స్వతంత్ర అభ్యర్థులు, ఇతర చిన్న పార్టీల మద్దతు కూడగట్టి కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని నిర్ణయించారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై మంత్రులను, కార్యకర్తలను అభినందిస్తూ సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'గత ప్రభుత్వం పదేళ్లలో

..మిగతా 2లో



## నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లను కైవసం చేసుకుంటాం

మహేశ్ కుమార్ గౌడ్

కొత్తగూడెం కార్పొరేషన్ విషయంలో సరైన నిర్ణయం తీసుకుంటాం

ఈ ఎన్నికలు కవితకు సంతోషాన్ని ఇచ్చి ఉంటాయని వ్యాఖ్య

రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభావం ఉండదన్న పీసీసీ ప్రెసిడెంట్

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ప్రభాత ఉదయం)

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటిన సంగతి తెలిసిందే. ఎన్నికల ఫలితాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంతృప్తిని వ్యక్తం చేశారు. నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లను కూడా తామే కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కొత్తగూడెం కార్పొరేషన్ విషయంలో సరైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఈరోజు సమావేశ మవుతానని... ఈ భేటీలో కార్పొరేషన్లపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ ఎన్నికలు కల్వకుంట్ల కవితకు

..మిగతా 2లో

## ఢిల్లీ- అంబాల మధ్య మూడు, నాలుగో రైల్వే లైన్ ఏర్పాటు



రూ.1,60,504 కోట్ల విలువైన పనులకు కేబినెట్ ఆమోదం

అస్సాంలో అండర్ వాటర్ రివర్ టన్నెల్ నిర్మాణం

క్యాబినెట్ కీలక నిర్ణయాలు

2లో..

## కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కౌన్సిలర్లు

బెల్లంపల్లిలో ఆసక్తికరం...

34 వార్డులు ఉండగా చెరో 14 స్థానాలు గెలిచిన కాంగ్రెస్, బీఆర్ఎస్

బీఆర్ఎస్‌లో చేరిన 26వ వార్డు కాంగ్రెస్, 30వ వార్డు రెబల్ కౌన్సిలర్లు

బీఆర్ఎస్‌తో కలిసి పనిచేస్తానన్న బీజేపీ కౌన్సిలర్

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ప్రభాత ఉదయం)



తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో 30కి పైగా మున్సిపాలిటీలలో హంగ్ ఏర్పడిన నేపథ్యంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ ఆయా చోట్ల చైర్మన్ పదవులను దక్కించుకోవడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ క్రమంలో బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ఇక్కడ మొత్తం 34 వార్డులు ఉండగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చెరో 14 స్థానాలు కైవసం చేసుకున్నాయి. బీజేపీ ఒకటి, ఇతరులు 5 స్థానాలు దక్కించుకున్నారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులు దక్కించుకోవడానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ స్వతంత్రులతో చర్చలు జరుపుతున్న క్రమంలో ముగ్గురు కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీలో చేరడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీకి చెందిన 26వ వార్డు కౌన్సిలర్ ఇప్పకుమార్ స్వామి, కాంగ్రెస్ రెబల్‌గా పోటీ చేసి గెలిచిన 30వ వార్డు కౌన్సిలర్ సుఖేషిణి భరద్వాజ్, 34వ వార్డు బీజేపీ కౌన్సిలర్ కొక్కుల రామ్మూర్తి బీఆర్ఎస్‌లో చేరారు. 30 వార్డు కౌన్సిలర్, 26వ వార్డు కౌన్సిలర్‌లు అధికారికంగా బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కేటీఆర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 34వ వార్డు బీజేపీ అభ్యర్థి మాత్రం అధికారికంగా చేరనప్పటికీ, బీఆర్ఎస్ విధానాలకు ఆకర్షితుడనై మద్దతు ప్రకటిస్తున్నట్లు చెప్పారు. ఈ ముగ్గురితో బీఆర్ఎస్ పార్టీ బలం 17కు చేరుకుంది.

## కుట్రలు చేస్తే... మీ అందరినీ రాజకీయ సమాధి చేస్తా

బండి సంజయ్

కరీంనగర్ మేయర్ పీఠం బీజేపీదే అన్న బండి సంజయ్

మేయర్ పీఠాన్ని దక్కించుకుంటామని కాంగ్రెస్, బీఆర్ఎస్ అంటున్నాయని మండిపాటు

ఆ రెండు పార్టీలు ఒకటే అనే విషయం కరీంనగర్ వేదికగా బయటపడుతోందని విమర్శ

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ప్రభాత ఉదయం)

కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం మూడు పార్టీలు ఒకటేనని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. ఆ మూడు పార్టీలకు ప్రేమికుల రోజు శుభాకాంక్షలు అని వ్యగ్యంగా అన్నారు. కరీంనగర్ లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి ఎక్కువ స్థానాలు వచ్చినప్పటికీ... మేయర్ పీఠం దక్కించుకుంటామని కాంగ్రెస్, బీఆర్ఎస్ చెబుతున్నాయని... ఏ విధంగా దక్కించుకుంటాయో చెప్పాలని డిమాండ్

..మిగతా 2లో






2లో..

## ఛత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం

నలుగురు కోబ్రా కమాండోల దుర్మరణం

ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు కోబ్రా కమాండోల మృతి చెందారు

ధమ్తరి జిల్లాలో ఆగి ఉన్న ట్రక్కును ఢీకొట్టిన కమాండోల కారు

ఈ ఘటనలో మరో కమాండోకు తీవ్ర గాయాలు, పరిస్థితి విషమం

ప్రమాదంపై ఛత్తీస్‌గఢ్ సీఎం, హోంమంత్రి తీవ్ర దిగ్భ్రాంతి

## బీఆర్ఎస్ వైఫల్యాల వల్లే కాంగ్రెస్‌కు ఎక్కువ స్థానాలు: కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ప్రభాత ఉదయం)

భారత రాష్ట్ర సమితి పూర్తి వైఫల్యం వల్లే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎక్కువ స్థానాలు వచ్చాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. భాజపా, బీఆర్ఎస్ పొత్తుకు ఇది తొలి మెట్టుగా భావిస్తున్నట్లు చెప్పారు. గతంలో సీపీఎం, సీపీఐలను తోక పార్టీలు అని ఇప్పుడు తోక పార్టీలకు తోక పార్టీగా బీఆర్ఎస్ మారుతోందని అన్నారు. సింగరేణి కుంభకోణంపై సీపీఐ, ఏఐటీయూసీ కనీసం నోరు కూడా విప్పలేదని, కూనంనేని సాంబశివరావు కాళేశ్వరం విషయంలో కేసీఆర్‌పై ఏం మాట్లాడారో

..మిగతా 2లో

# మున్సిపాలిటీలను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

మొదటి పేజీ తరువాయి...

చేయలేని పనులను మా ప్రజా ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే చేసి చూపించింది. మా సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ప్రజలకున్న నమ్మకమే ఈ విజయానికి పునాది' అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మంత్రులందరూ కలిసికట్టుగా పనిచేయడం వల్లే ఈ స్థాయిలో ఫలితాలు వచ్చాయని ఆయన కొనియాడారు. ఎన్నికల విజయం కేవలం ఆరంభం మాత్రమేనని, అసలైన అభివృద్ధి ఇప్పుడే మొదలవ్వాలని మంత్రులకు సీఎం సూచించారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని అధికారులకు, మంత్రులకు స్పష్టం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను, సంక్షేమ ఫలాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో వచ్చే అన్ని ఎన్నికలనూ ఎదుర్కోవాలని సీఎం రేవంత్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇదిలావుంటే సీఎం రేవంత్‌రెడ్డితో సీపీఐ నేత పల్లా వెంకట్‌రెడ్డి సమావేశమయ్యారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, తాజా పరిణామాలు, కొత్తగూడెం కార్పొరేషన్ గురించి చర్చించారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ కూటమి (కాంగ్రెస్-22, సీపీఎం-1) 23 డివిజన్లలో విజయం



సాధించింది. సీపీఐకి 22, బీఆర్ఎస్-8, భాజపా-1, స్వతంత్రులు 6 డివిజన్లలో గెలుపొందారు. స్వతంత్రుల్లో ఒకరు సీపీఐ నాయకుడు కావటంతో ఆ పార్టీ బలం కూడా 23కు చేరింది. మిగిలిన ఐదుగురు స్వతంత్రుల్లో ముగ్గురు, బీఆర్ఎస్ నుంచి గెలిచిన వారిలో ముగ్గురు హస్తం గూటికి చేరటంతో కాంగ్రెస్ కూటమి బలం 29కు పెరిగింది. అయితే భద్రాద్రి కొత్తగూడెం కార్పొరేషన్‌పై ఉత్కంఠ వీడింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో సీపీఐ నేత పల్లా వెంకట్ రెడ్డి సమావేశం కావడంతో ఉత్కంఠకు తెరపడింది. కొత్తగూడెం కార్పొరేషన్ అంశంపై చర్చించిన నేతలిద్దరూ ఓ అంగీకారానికి వచ్చారు. మేయర్ పోస్ట్ సీపీఐకి, డిప్యూటీ మేయర్ పోస్ట్ కాంగ్రెస్ పార్టీకి ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. దీంతో కొత్తగూడెం కార్పొరేషన్ అంశం ఓ కొలిక్కి వచ్చింది. కాగా, ఈ కార్పొరేషన్‌లోని 60 డివిజన్లకు ఈనెల 11న ఎన్నికలు జరగ్గా.. 13న ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో కాంగ్రెస్ 22, సీపీఐ 22, బీఆర్ఎస్ 8, సీపీఎం 1, బీజేపీ 1, స్వతంత్రులు 6 స్థానాల్లో జయకేతనం ఎగురవేశారు. మరోవైపు కొత్తగూడెం కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ 8 డివిజన్లను సొంతం చేసుకుంది. అయితే, వారంతా కాంగ్రెస్ పార్టీతో టచ్‌లో ఉన్నారంటూ ప్రచారం జరిగింది. దీనిపై ఆ 8మంది కార్పొరేటర్లు స్పందించారు. మేయర్ ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం చెప్పిందే తమకు శిరోధార్యమంటూ తేల్చి చెప్పారు. పార్టీ నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామని ప్రకటించారు. ఈ మేరకు బీఆర్ఎస్ కార్పొరేటర్లు అమ్ముడు పోయారంటూ చేసే ప్రచారం అవాస్తమంటూ వీడియో విడుదల చేశారు.

# ఢిల్లీ- అంబాలమధ్య మూడు, నాలుగో రైల్వే లైన్ ఏర్పాటు

## రూ.1,60,504 కోట్ల విలువైన పనులకు కేబినేట్ ఆమోదం

## అస్సాంలో అండర్ వాటర్ రివర్ టన్నెల్ నిర్మాణం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14 (ప్రభాత ఉదయం)

ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన శనివారం జరిగిన కేంద్ర సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ భేటీకి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, అశ్విని వైష్ణవ్ తదితరులు హాజరయ్యారు. ప్రధానంగా ప్రధానమంత్రి కార్యాలయం పేరును 'సేవతీర్థ్'గా మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. అలాగే రూ. 1,60,504 కోట్ల విలువైన పనులను చేపట్టాలని కేంద్ర సర్కార్ నిర్ణయించింది. అస్సాంలో అండర్ వాటర్ రివర్ టన్నెల్ నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రోహుపూర్-నుమాలిఘర్ మధ్య అండర్ వాటర్ రోడ్డు టన్నెల్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదించింది. 34 కిలోమీటర్ల మేర అండర్ వాటర్ టన్నెల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. ఈ టన్నెల్ నిర్మాణంతో 250 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. ఈ టన్నెల్ నిర్మాణం ద్వారా 6 గంటల సమయం పట్టే గమ్యస్థానాన్ని కేవలం 20 నిమిషాల్లోనే చేరుకునే అవకాశం ఉంది. బ్రహ్మపుత్ర నది కింద రైల్వేలైన్, నేషనల్ హైవే కోసం టన్నెల్‌ని నిర్మించనుంది. అలాగే కసారా-మన్మాడ్ మూడు, నాలుగో రైల్వేలైన్ ప్రాజెక్ట్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఢిల్లీ- అంబాల మధ్య మూడు, నాలుగో రైల్వే లైన్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బళ్లారి-హోస్పేట మధ్య రూ.2,372 కోట్లతో 3, 4 రైల్వేలైన్ల ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదించింది. గూడె బేల్లూరు నుంచి మహబూబ్‌నగర్ సెక్షన్ మధ్య రూ.3,175 కోట్ల ఖర్చుతో నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి ఆమోదం తెలిపింది. మహబూబ్‌నగర్ , నారాయణపేట, రాయచూర్, దేవరకద్ర, హైదరాబాద్‌కు ఈ కనెక్టివిటీ ఉంది. హైదరాబాద్-పనాజీ కారిడార్‌లో భాగంగా కొత్త నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం చేపట్టనుంది. 80 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.3175 కోట్ల ఖర్చు చేయనుంది. దమాసియా- బిటాడ నర్సాపూర్ మలోత సెక్షన్ మధ్య నాలుగు లైన్ల నిర్మాణానికి రూ.4,584 కోట్లను



ఖర్చు చేయనుంది. గోతి- ట్రిమ్బక్ - పాల్ఘర్ సెక్షన్ అబ్రిడేషన్ కోసం రూ.3320 కోట్లని కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేయనుంది.

# ఛత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం

**నలుగురు కోబ్రా కమాండోల దుర్మరణం**

**ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు కోబ్రా కమాండోల మృతి చెందారు**

**ధమ్తరి జిల్లాలో ఆగి ఉన్న ట్రక్కును ఢీకొట్టిన కమాండోల కారు**

**ఈ ఘటనలో మరో కమాండోకు తీవ్ర గాయాలు, పరిస్థితి విషమం**

**ప్రమాదంపై ఛత్తీస్‌గఢ్ సీఎం, హోంమంత్రి తీవ్ర దిగ్భ్రాంతి**

**అతివేగమే ప్రమాదానికి కారణమంటున్న పోలీసులు**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14 (ప్రభాత ఉదయం)

ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 201వ కోబ్రా బెటాలియన్‌కు చెందిన నలుగురు కమాండోలు ప్రాణాలు కోల్పోయారు. మరో కమాండో ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ధమ్తరి జిల్లాలోని ఖప్రి బైపాస్‌పై శనివారం ఆగి ఉన్న ఒక ట్రక్కును కోబ్రా కమాండోలు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. నక్సలిజంపై పోరాటంలో అంకితభావంతో పనిచేస్తున్న కమాండోలు మరణించడంపై రాష్ట్రవ్యాప్తంగా విషాద ఛాయలు అలుముకున్నాయి.

అర్జుని పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కమాండోలు జగదల్‌పూర్ నుంచి కారులో తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన కారు ఆగి ఉన్న ట్రక్కును వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం ట్రక్కు కిందకు దూసుకెళ్లి నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని, గ్యాస్ కట్టర్ల సహాయంతో కారులో చిక్కుకున్న వారిని బయటకు తీశాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు కమాండోలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు విడిచారు. తీవ్రంగా గాయపడిన మరో కమాండోను ధమ్తరి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ఈ ఘటనపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి 'ఎక్స్' వేదికగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "కోబ్రా బెటాలియన్ వీర జవాన్ల అకాల మరణం చెందారన్న వార్త హృదయ విదారకంగా ఉంది. దేశ సేవలో అంకితమైన ఆ అమర జవాన్లకు నా వినమ్ర నివాళులు" అని పేర్కొన్నారు. రాష్ట్ర హోంమంత్రి విజయ్ శర్మ కూడా మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రాథమికంగా అతివేగమే ప్రమాదానికి కారణంగా పోలీసులు భావిస్తున్నప్పటికీ, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఆపరేషన్ల కోసం సీఆర్‌పీఎఫ్ కింద పనిచేసే ప్రత్యేక దళమే కోబ్రా (కమాండో బెటాలియన్ ఫర్ రెజల్యూట్ యాక్షన్).

# తెలంగాణ ప్రజలు మమ్మల్ని ఆశీర్వదించారు

**జాతీయ మీడియాతో కల్వకుంట్ల కవిత**

**మున్సిపల్ ఎన్నికల ఫలితాలు తమకు సంతోషాన్ని ఇచ్చాయన్న కవిత**

**ఒక మున్సిపాలిటీని కైవసం చేసుకున్నామన్న జాగృతి అధ్యక్షురాలు**

**తెలంగాణ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తామని వ్యాఖ్య**

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ప్రభాత ఉదయం)

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంతోషాన్ని వ్యక్తం చేశారు. కవిత మద్దతుదారులు పలు ప్రాంతాల్లో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఆమె జాతీయ మీడియాతో మాట్లాడుతూ... భవిష్యత్తులో తాము ఒక రాజకీయ పార్టీగా అవతరించబోతున్నామనే విషయాన్ని ఇప్పటికే ప్రకటించామని తెలిపారు. తమ పార్టీని అధికారికంగా ప్రకటించక ముందే... మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేద్దామని చివరి నిమిషంలో తమ కార్యకర్తలు కోరారని... వారి కోరిక మేరకు తాము ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై ఎన్నికల బరిలోకి దిగామని వెల్లడించారు. సొంత పార్టీ తరపున పోటీ చేయకపోయినప్పటికీ... తెలంగాణ ప్రజలు తమను మంచి ఫలితాలతో ఆదరించారని తెలిపారు. ఎన్నికల్లో తాము ఒక మున్సిపాలిటీని కైవసం చేసుకున్నామని, మరో మున్సిపాలిటీలో వైస్ చైర్మన్ పదవిని దక్కించుకోబోతున్నామని కవిత చెప్పారు. మరో 40 చోట్ల తమ కార్యకర్తలు దాదాపుగా గెలుపు అంచుల వరకు వచ్చారని అన్నారు. ఈ ఎన్నికల ఫలితాలు తమ పార్టీ భవిష్యత్తుపై భరోసాను కల్పించాయని చెప్పారు. అహంకారం లేని, అత్యంత పారదర్శకమైన రాజకీయాలను అందిస్తామని తాము పదేపదే చెబుతున్నామని... ప్రజలు తమను విశ్వసించారని తెలిపారు. భవిష్యత్తులో కూడా తమకు ప్రజల మద్దతు ఇలాగే కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాజకీయాల్లో తాము ప్రధాన భూమికను పోషిస్తామని తెలిపారు.





# నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లను కైవసం చేసుకుంటాం

సంతోషాన్ని ఇచ్చి ఉండవచ్చని మహేశ్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ రోజురోజుకు పతనమవుతోందని... రాబోయే రోజుల్లో ఆ పార్టీ ప్రభావం ఉండదని చెప్పారు. మతాన్ని రెచ్చగొట్టినా మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఏమీ సాధించలేకపోయిందని ఎద్దేవా చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, ఈ ఎన్నికల ఫలితాలతో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో తన పట్టును మరింత పెంచుకున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# బీఆర్ఎస్ వైఫల్యాల వల్లే కాంగ్రెస్‌కు ఎక్కువ స్థానాలు: కవిత

మొదటి పేజీ తరువాయి...

కేటీఆర్ గుర్తుకు తెచ్చుకోవాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో కవిత మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ఎన్ని మున్సిపాల్టీలను కోల్పోయిందో ఆలోచించాలని, నిజామాబాద్ సహా అన్ని చోట్లా పూర్తిగా కేడర్‌ను వదిలిపెట్టిందని కవిత విమర్శించారు. కేటీఆర్, మాజీ మంత్రులు ఎన్ని చోట్ల ప్రచారం చేశారు? కాంగ్రెస్ వైఫల్యాలపై బీఆర్ఎస్ ఎక్కడ పోరాటం చేస్తోందని ప్రశ్నించారు. ఎన్నికల హామీలను అమలు చేయని కాంగ్రెస్ పార్టీ మొదటి స్థానంలో.. బీఆర్ఎస్ పార్టీ కొన్ని చోట్ల మూడో స్థానంలో, మరి కొన్ని చోట్ల నాలుగో స్థానంలో నిలిచిందని చెప్పారు. కరీంనగర్‌లో మినహాయిస్తే భాజపా ఎక్కడా లేదని వ్యాఖ్యానించారు.

ఈ ఎన్నికల్లో ప్రజలు 40కిపైగా స్థానాల్లో జాగృతి, ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులను గెలిపించారని, వడ్డేపల్లిలో తమకు పూర్తి ఆధిక్యం వచ్చినా అధికార పార్టీ, ఇతరులు ప్రలోభాలకు గురి చేశారని కవిత ఆరోపించారు. 16 మున్సిపాలిటీలు రావడమే ఎక్కువ అన్నట్లుగా కేటీఆర్ మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ పరిస్థితుల్లో తమ లాంటి వాళ్లను ప్రజలు ఆదరిస్తారన్న విశ్వాసం కలుగుతోందని కవిత తెలిపారు. తానే రాజు - తానే మంత్రి అంటున్న సీఎం రేవంత్ రెడ్డి.. ముందు హామీల అమలుపై దృష్టి సారించాలని కోరారు. తమది ట్రైలర్ మాత్రమేనని, పిక్చర్ ఇంకా మిగిలే ఉందని చెప్పారు. తొందరపడి కారు కూతలు కూయవద్దని, తప్పులను సరిదిద్దుకొని ప్రజల్లో ఉండాలని బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలకు సూచించారు. సింగరేణి ఎన్నికల్లో జాగృతి, హెచ్ఎంఎస్ కలిసి పోటీ చేసి సత్తా చాటుతామని కవిత తెలిపారు.

# కుట్రలు చేస్తే... మీ అందరినీ రాజకీయ సమాధి చేస్తా

మొదటి పేజీ తరువాయి...

చేశారు. ఈ రెండు పార్టీలు ఒకటే అనే విషయం కరీంనగర్ వేదికగా బయటపడుతోందని చెప్పారు.

కరీంనగర్ మేయర్ పీఠం తమదేనని బండి సంజయ్ అన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్రలు చేస్తే... కరీంనగర్ నుంచే యుద్ధాన్ని ప్రారంభిస్తానని హెచ్చరించారు. వారందరినీ రాజకీయ సమాధి చేస్తానని సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. బీజేపీ కార్యకర్తల శక్తి, దమ్ము మీకు తెలియదు అని అన్నారు.

కరీంనగర్ కార్పొరేషన్లో బీజేపీకి కేవలం 13 సీట్లే వస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇంటెలిజెన్స్ విభాగం నివేదిక ఇచ్చిందని సంజయ్ తెలిపారు. అందుకే, ఈ విజయాన్ని ఇంటెలిజెన్స్ కే అంకితమిస్తున్నామని అన్నారు. మేయర్ పదవి కోసం గుంటనక్కలన్నీ ఏకమయ్యాయని మండిపడ్డారు. బీజేపీ సింహమని, సింగిల్ గానే వస్తుందని చెప్పారు.

మరోవైపు, కరీంనగర్ కార్పొరేషన్లో మొత్తం 66 డివిజన్లు ఉండగా... బీజేపీ 30 డివిజన్లలో జయకేతనం ఎగురవేసింది. కాంగ్రెస్ 14, బీఆర్ఎస్ 9 స్థానాలకే పరిమితమయ్యాయి. ఈ నెల 16న కార్పొరేటర్ల ప్రమాణస్వీకారం ఉంటుంది.


# నరవణే పుస్తకం ఎఫెక్ట్... కీలక నిర్ణయం దిశగా కేంద్రం

**పుస్తకాల విషయంలో కొత్త నిబంధనపై కేంద్రం చర్చ**

**20 ఏళ్ల కూలింగ్ ఆఫ్ పీరియడ్ నిబంధన తేవాలని భావిస్తున్న కేంద్రం**

**రిటైర్ అయ్యాక 20 ఏళ్ళ వరకు సున్నిత అంశాలపై పుస్తకాలు రాయకూడదనే నిబంధన**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14 (ప్రభాత ఉదయం)




మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే దిశగా ఆలోచన చేస్తోంది. మిలిటరీ అధికారులు, అత్యున్నత పదవుల్లోని వ్యక్తులకు సంబంధించిన పుస్తకాల విషయంలో కేంద్రం కొత్త నిబంధనలు తీసుకురావాలని భావిస్తోంది.

ప్రస్తుతం పనిచేస్తున్న, పదవీ విరమణ చేసిన సాయుధ దళాల సిబ్బంది పుస్తకాలు రాయడానికి, ప్రచురించడానికి 20 సంవత్సరాల 'కూలింగ్ ఆఫ్ పీరియడ్' మార్గదర్శకాలను ప్రవేశపెట్టడాన్ని కేంద్రం పరిశీలిస్తోందని తెలుస్తోంది. ఆయా అధికారులు పదవుల నుంచి రిటైర్ అయిన తర్వాత ఇరవై సంవత్సరాల వరకు వారి పుస్తకాలు పబ్లిష్ కాకుండా తప్పనిసరిగా ఈ నిబంధనను అమలు చేయాలని కేంద్రం భావిస్తోందని తెలుస్తోంది.

ఇటీవల జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ విషయం చర్చించారని ఆంగ్ల మీడియాలో వార్తలు వచ్చాయి. సీనియర్ సైనిక అధికారులతో సహా ఉన్నత పదవులు నిర్వహించిన వారు సున్నితమైన అంశాలపై పుస్తకాలు రాయడానికి తప్పనిసరి కూలింగ్ ఆఫ్ పీరియడ్ నిబంధనను తీసుకురావాలని ఎక్కువ మంది మంత్రులు సమర్థించారని తెలుస్తోంది. అయితే ఇది కేబినెట్ అధికారిక అజెండాలో భాగం కాలేదని, సాధారణ చర్చగా సాగిందని పేర్కొన్నారు.

## చిన్న అనంతగిరి శివాలయంలో ఘనంగా ప్రారంభమైన

# మహా శివరాత్రి పూజలు



గణపతి హోమంలో పాల్గొన్న భక్తులు



చిన్న అనంతగిరి శివాలయంలో కొలువు దీరిన పరమ శివుడు

**బుద్వేల్, ఫిబ్రవరి 14 (ప్రభాత ఉదయం)**

మహా శివరాత్రి వేడుకల సందర్భంగా అత్తాపూర్ రాంబాగ్ చిన్న అనంతగిరి శివాలయంలో శనివారం పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. శివరాత్రి పండుగ ను పురస్కరించుకుని ప్రతి సంవత్సరం చిన్న అనంతగిరి శివాలయంలో మూడు రోజుల పాటు పూజలు, భజనలు, అన్నదాన కార్యక్రమాలు, జాగరణ కార్యక్రమాలు, దేవాలయాల పుష్పాలంకరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తారు. అందులో బాగంగా శనివారం ఉదయం 4గంటల కు సుప్రభాత సేవ తో ప్రారం భమైన పూజలు రాత్రి వరకు కొనసాగాయి. గణపతి, ఆంజనేయస్వామి, పరమ శివునికి అభిషేకాలు, ఉమా మహేశ్వరీ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, గణపతి హోమం, నవగ్రహ విశేష పూజలు నిర్వహించారు. ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో గణపతి హోమం అనంతరం పూర్ణాహుతి, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. గీతా పారాయణం, భజన కార్యక్రమాలను నిర్వహిం చారు. దేవాలయ పరిసరాలలో విద్యుత్ దీపాలతో అలంకరణలు, స్వాగత తోరణాలతో భక్తులను ఎం తగానో ఆకట్టుకున్నాయి. పూజా, భజన కార్యక్రమాలలో ప్రణవ భక్త సమాజం అధ్యక్షులు మోంద్ర నర్సింహ్మా , ప్రధాన కార్యదర్శి పుస్తకాల అశోక్, కోశాధికారి స్తోత్రభాష్యం హరినాద్, కార్యదర్శులు కొండమీది హరినాథ్, రావుల గండయ్య, ముఖ్య సలహాదారులు ఎన్ మల్లారెడ్డి, కొలన్ సుభాష్ రెడ్డి, మ్యాడం రామేశ్వర్ రావు, మోంద్ర కొమురయ్య, మ్యాడం మధుసూదన్, ఎస్ జయానందరెడ్డి, షాబాద స్వప్న-విజయ్ కుమార్, సింగాపురం శృతి - మహేశ్వర్ రెడ్డి, మోంద్ర ఐలయ్య, పెంటల సుదాకర్ రెడ్డి, ఎం బాలసుబ్రమణ్యం, మ్యాడం రాము, కె కిరణ్ చారి, కారులారం క్రిష్ణ, చెట్టిగారి నరేందర్ రావు, సులిగె వెం కటేశ్, కాడెం నర్సింగ్ రావు , కొంగళ్ల ప్రసాద్, సోమారం సురేందర్, తాటి రాజు, పవన్ భారతి, పోత్రావత్ రమేశ్ నాయక్, ఎస్ బజరంగిరెడ్డి, తులగారి లలితా శ్రీరాములు పాల్గొన్నారు.



హైదర్ గూడ లో స్వాగత వేదిక



## విద్యుత్ స్తంభంపై చిక్కుకున్న పిల్లిని కాపాడిన సిబ్బంది

**రాజేంద్రనగర్,ఫిబ్రవరి14(ప్రభాత ఉదయం)**

విద్యుత్ స్తంభంపై చిక్కుకున్న పిల్లి ని విద్యుత్ సిబ్బంది రక్షించారు రాజేంద్రనగర్ డివిజన్ లో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు మారాయి.హిమాయత్ సాగర్ సెక్షన్ లో పీ అండ్ టీ కాలనీలో విద్యుత్ స్తంభంపైన ఉన్న కేబుల్లో పిల్లి చిక్కుకుంది.ఈ విషయం కాస్త స్థానికులు గుర్తించి విద్యుత్ విభాగం అధికారులకు తెలియజేశారు.ఈ నేపథ్యంలో విద్యుత్ సిబ్బంది అక్కడకు చేరుకొని పిల్లిని కాపాడేందుకు శతవిధాలా ప్రయత్నించారు.విద్యుత్ సిబ్బంది మనోజ్,జేఎల్ఎం,రామకృష్ణ,ఆర్టిజన్ కలిసి ఆ పిల్లని క్షేమంగా కిందికు దించారు.దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## ఉగ్రదాడులకు కాంగ్రెస్ జవాబివ్వలేదు

### మోదీ ప్రభుత్వం వాళ్ల ఇంటికెళ్లి కొట్టింది

### కేంద్ర హోంమంత్రి అమిత్ షా విమర్శలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14(ప్రభాత ఉదయం):**

కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పాలనలో ఉగ్రదాడులకు సరైన సమాధానం దొరకలేదని, మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులకు గట్టి సమాధానం చెప్పిందని వ్యాఖ్యానించారు. 2019 ఫిబ్రవరి 14 జరిగిన పుల్వామా ఉగ్రదాడిని ఉటంకిస్తూ, ప్రతీకారం తీర్చుకునే కొత్త సంప్రదాయానికి మోదీ శ్రీకారం చుట్టారని షా పేర్కొన్నారు. యూపీఏ పాలనలో పాకిస్థాన్ ఉగ్రవాదులు, భారత సైనికులపై తీవ్ర స్థాయిలో దాడులు జరిపారని ఆరోపించారు. కానీ మోదీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మన సైనికులు, శత్రువుల భూభాగంలోకి చొచ్చుకెళ్లి ఉగ్రవాదులను అంతమొందించారని చెప్పారు. కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోని కారైకల్‌లో జరిగిన బీజేపీ బహిరంగ సభలో అమిత్ షా ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పుల్వామా ఉగ్రదాడిలో మరణించిన 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లకు నివాళులర్పించారు.పుల్వామా ఉగ్ర దాడిలో ప్రాణాలు అర్పించిన సైనికులకు నివాళులు అర్పిస్తున్నాను. కాంగ్రెస్ పాలనలో, పాకిస్థాన్ ఉగ్రవాదులు ప్రతిరోజూ మన సైనికులపై దాడి చేసేవారు. దీనిపై దేశ ప్రధానమంత్రి, హోంమంత్రి లేదా రక్షణ మంత్రి నుంచి ఎటువంటి స్పందన ఉండేది కాదు. కానీ పుల్వామా దాడికి ప్రతీకారంగా మోదీ ప్రభుత్వం వైమానిక దాడులు చేసింది. పాకిస్థాన్ గగనతలంలోకి ప్రవేశించి, ఉగ్రవాద స్థావరాలను మట్టికరిపించింది. ప్రధాని మోదీ హయాంలో మొదట సర్జికల్ స్ట్రైక్, ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌కు గట్టి సమాధానం ఇచ్చిందని అన్నారు.



నూతన కార్యవర్గం

## జనగామ పట్టణ కార్పెంటర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 14(ప్రభాత ఉదయం):**

జనగామ పట్టణ కార్పెంటర్స్ అసోసియేషన్ నూతన కమిటీని జిల్లా అధ్యక్షులు దీగోజు సాంబచారి, గౌరవాధ్యక్షులు దీగోజు నరసింహ చారి ఆధ్వర్యంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా బత్తోజు సిద్ధిరాములు చారి, ప్రధాన కార్యదర్శిగా సరబోజు రాజు చారి, గౌరవాధ్యక్షులుగా పుత్కనూరి వీరస్వామి చారి, ఉపాధ్యక్షులుగా పడకంటి చంద్రమౌళి చారి, కోశాధికారిగా కాసోజు సంతోష్ చారి, సహాయ కార్యదర్శి గా ముమ్మాడి. గణేష్ చారి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వారికి వారి వారి బాధ్యతలను తెలుపుతూ పట్టణ కార్పెంటర్లకు అందుబాటులో ఉంటూ సంఘ అభివృద్ధికి పాటుపడాలని సూచనలు చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సాతెల్లి రాజు, జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల మల్లేశం చారి, జిల్లా సహాయ కార్యదర్శి మైలారం చంద్రశేఖర్ చారి, సంఘ పెద్దలు మద్దోజు సిద్దయ్య చారి, పోలోజు బ్రహ్మచారి, పోలోజు. బాస్కర్, మందోజు నరసింహ చారి, వేమూనూరి రాజేద్రప్రసాద్, పోలోజు గోవింద చారి, రమేష్, పోలోజు సిద్దయ్య చారి, పోలోజు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అమెరికా ఒప్పందంతో


# రైతులకు తీవ్ర నష్టం

### వస్త్ర పరిశ్రమ, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతారు

### ఒప్పందంపై భ్రమలు కల్పిస్తున్న ప్రధాని మోదీ

### కాంగ్రెస్ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14(ప్రభాత ఉదయం):**



అమెరికాతో మోదీ సర్కార్ చేసుకున్న ఒప్పందం కారణంగా దేశంలో వస్త్ర పరిశ్రమ, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ఆరోపించారు. ప్రధాని, ఆయన కేబినెట్ మంత్రులు ప్రజల్లో భ్రమలు కల్పిస్తున్నారని ఆయన ఎక్స్‌లో దుయ్యబట్టారు. అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకుంటేనే, భారత వస్త్ర పరిశ్రమకు సుంకాల మినహాయింపు ఉంటుందనే విషయాన్ని ఎందుకు దాచారని ఆయన ప్రశ్నించారు. బంగ్లాదేశ్ కూడా భారత్ నుంచి పత్తి దిగుమతులను నిలిపివేసే సంకేతాలు ఇస్తోందని, తద్వారా రైతులకు నష్టం జరుగుతుందని రాహుల్ గాంధీ ఆరోపించారు. దూరదృష్టి గల ప్రభుత్వం అయితే పత్తి రైతులు, టెక్స్‌టైల్ ఎగుమతిదారుల ప్రయోజనాలను కాపాడేలా ఒప్పందం చేసుకునేదని రాహుల్ అన్నారు.భారత్‌లోని టెక్స్‌టైల్ రంగం 5 కోట్ల కుటుంబాలకు ఉపాధినిస్తోంది. నరేంద్ర మోదీ అమెరికాతో చేసుకున్న ఒప్పందం భారత టెక్స్‌టైల్ రంగాన్ని అంతం చేస్తుంది. ఈ విషయం నరేంద్ర మోదీకి, మొత్తం భారతదేశానికి తెలుసు. అదే నేను పార్లమెంటులో చెప్పాను. బంగ్లాదేశ్‌కు 0% పన్ను, భారత్‌కు 18% పన్ను విధిస్తున్నారు. అందువల్ల భారత టెక్స్‌టైల్ పరిశ్రమను బంగ్లాదేశ్ టెక్స్‌టైల్ పరిశ్రమ దెబ్బతీస్తుంది. మనకు కూడా ఆ రాయితీ కావాలంటే అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకోవాలని కేంద్రమంత్రి ఒకరు చెప్పారు. కానీ అసలు నిజం ఏమిటంటే మన పత్తి బంగ్లాదేశ్‌కు వెళ్తుంది. మన పత్తి ద్వారానే భారత్‌లో టెక్స్‌టైల్ మిల్లులు నడుస్తున్నాయి. ఒకవేళ మనం బంగ్లాదేశ్ లాగా అమెరికా పత్తిపై ఆధారపడితే మన దేశంలో పత్తి రైతులు, వస్త్ర పరిశ్రమ నాశనమైపోతాయి. ఒకవేళ మనం అమెరికా పత్తిని దిగుమతి చేసుకోకపోతే మన టెక్స్‌టైల్ పరిశ్రమ దెబ్బతింటుంది. ఇదే అసలు నిజం. పీయూష్ గోయల్ అబద్ధాలు చెప్పవద్దు. అందుకే 'సరెండర్' అంటున్నాను. ఎందుకంటే ఈ ఒప్పందం వల్ల పత్తి రైతు నష్టపోతాడని అన్నారు. ఒకవేళ మోదీ ప్రభుత్వం జాతీయ ప్రయోజనాల కోసం ఆలోచించి ఉంటే పత్తి రైతులు, వస్త్ర ఎగుమతిదారుల శ్రేయస్సును రక్షించే విధంగా చర్చలు జరిపి ఉండేదని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. మోదీ, ఆయన ప్రభుత్వం కలిసి రెండు రంగాలకు తీవ్ర నష్టం కలిగించే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. ఈ ఒప్పందం కారణంగా పత్తి, వస్త్ర పరిశ్రమ రంగాలపై ఆధారపడి ఉన్న కోట్లాది మంది భారతీయుల కుటుంబాలను నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభం అనే గొయ్యిలోకి నెట్టివేశారని రాహుల్ గాంధీ విమర్శించారు.గత వారం భారత్-అమెరికా మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. అయితే, ఈ ఒప్పందంలో యూఎస్ పారిశ్రామిక వస్తువులు, విస్తృత శ్రేణి ఆహార, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలను తొలగించడం లేదా తగ్గించడం వంటివి ఆ ఒప్పందంలో ఉన్నాయి. వీటిలో పశుగ్రాసం కోసం ఎర్ర జొన్న, చెట్ల గింజలు, తాజా ప్రాసెస్ చేసిన పండ్లు, సోయాబీన్ నూనె, వైన్, స్పిరిట్స్, అదనపు ఉత్పత్తులు ఉన్నాయి. ప్రతిగా, యునైటెడ్ స్టేట్స్ వస్త్రాలు, తోలు, పాదరక్షలు, ప్లాస్టిక్, రబ్బరు, సేంద్రీయ రసాయనాలు, గృహాలంకరణ, చేతివృత్తుల ఉత్పత్తులు వంటి ఎంపిక చేసిన భారతీయ వస్తువులపై 18 శాతం సుంకాలను వర్తింపజేయనుంది. అయితే ఒప్పందం పూర్తిగా అమల్లోకి వచ్చిన తర్వాత, జెనరిక్ ఫార్మాస్యూటికల్స్, రత్నాలు, వజ్రాలు, విమాన భాగాలు వంటి వస్తువులపై అమెరికా విధించిన సుంకాలు తొలగిపోనున్నాయి.

## అక్కను వదిలేసి మరో మహిళను వివాహం చేసుకున్న

# బావను హత్య చేసిన బామ్మర్దులు

**బుద్వేల్, ఫిబ్రవరి 14 (ప్రభాత ఉదయం)**

అక్క ను వదిలేసి మరో మహిళను వివాహం చేసుకున్న బావ ను అతని బామ్మర్దులు శనివారం మద్యాహ్నం దారుణంగా హత్య చేశారు. తమ అక్కను పెళ్లి చేసుకుని ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నాక, ఆమె ను వదిలి మరో మహిళ తో ఉంటున్న బావను చూసి తట్టుకోలేక ఈ హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, అత్తాపూర్ ఇన్స్పెక్టర్ కె నాగేశ్వర్ రావు తెలిపిన వివరాలు ఈ విదంగా ఉన్నాయి....... సులేమాన్నగర్ లో నివాసం ఉండే మహ్మద్ ఖదీర్ (36) లా చేసి న్యాయవాది వద్ద ప్రాక్టీస్ చేస్తున్నాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా చేస్తుంటాడు. ఎనిమిది సంవత్సరాల క్రితం సులేమాన్నగర్ ప్రాంతానికి చెందిన తబస్సుమ్ ఫాతిమా తో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉంది. కొం త కాలంగా తబస్సుమ్ ఫాతిమా తో గొడవలు జరుగగా మహ్మద్ ఖదీర్ ఆమెకు దూరంగా ఉంటున్నాడు. అదే ప్రాంతానికి చెందిన సిమ్రాన్ అనే మరో మహిళ ను రెండవ వివాహం చేసుకున్నాడు. తన అక్కను పెళ్లి చేసుకుని ముగ్గురు పిల్లలు



అయ్యాక ఆమెను వదిలి మరో మహిళను పెళ్లి చేసుకున్న బావ పై తబస్సుమ్ ఫాతిమా సోదరుడు కక్ష పెంచుకున్నాడు. శనివారం మద్యాహ్నం సులేమాన్నగర్ లోని తన కార్యాలయంలో మహ్మద్ ఖదీర్ ఒంటరిగా ఉన్నాడు. ఆ సమయంలో తబస్సుమ్ పాతిమా తమ్ముడు అనీఫ్ బావతో మాట్లాడేందుకు నలుగురు యువకుల తో కలసి వచ్చాడు. అందులో నుంచి ఇద్దరు య వకులు మాట్లాడుతుండగానే అనీఫ్, మరో యువకుడు కర్రతో బాదుతు, వెంట తెచ్చుకున్న కత్తితో ఖదీర్ కడుపులో విచక్షణారహితంగా పొడిచారు. ఈ దాడిలో మహ్మద్ ఖదీర్ తన చాంబర్లోనే కుప్పకూలి పోయాడు. ఖదీర్ మరణించాడని నిర్ధారించుకున్న తర్వాత అనీఫ్ తో పాటు అతని వెంట వచ్చిన య వకులు అక్కడినుంచి పారిపోయారు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, అత్తాపూర్ ఇన్స్పెక్టర్ కె నాగేశ్వర్ రావు లు సిబ్బంది తో కలసి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్థం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. క్లూస్ టీమ్ ను రప్పించి ఆధారాలు సేకరించారు. కుటుంబ కలహాల కారణంగానే ఈ హత్య జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. సీసీ టీవీ పుటేజీ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు ఎస్ఐ పార్వతి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసు న్నారు.

# ప్రేరణతో.... ప్రోత్సాహం

**విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణులు కావాలి**

**విద్యార్థులు లక్ష్యాలను నిర్ధారించుకొని కష్టపడి చదవాలి**

**విద్యతో పాటు ఆరోగ్యము ముఖ్యమే.**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 14 (ప్రభాత ఉదయం):**



ప్రేరణ కరపత్రంను విడుదల చేస్తున్న కలెక్టర్

పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి... జిల్లా ప్రథమ స్థానం సాధించుటకు విద్యార్థులు మరింత శ్రమించి చదవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు.శనివారం దేవరుప్పుల లోని తిరుమల గార్డెన్, మండలంలోని 11 పాఠశాలలకు చెందిన మార్చి- 2026 ఎస్ఎస్సి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల కోసం విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రేరణ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...విద్యార్థులు విజయోస్తు పుస్తకాలను పూర్తిగా చదివి అర్థం చేసుకోవాలని తద్వారా ప్రతి ఒక్కరు ఉత్తీర్ణత పొందుటకు వీలు కలుగుతుందని సూచించారు అలాగే గత ఐదు సంవత్సరాల క్రితం 10వ తరగతి ప్రశ్నాపత్రాలను క్షుణ్ణంగా చదివి జవాబులను చదువుతో పాటు వ్రాయడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించుటకు దోహదపడుతుందని ఆయన తెలిపారువిద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలంటే కష్టంగా కాకుండా ఇష్టంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ సూచించారు. విద్యార్థులు లక్షణాలు నిర్ధారించుకొని పక్కా ప్రణాళికల ను ఎంచుకొని కష్టంగా కాకుండా ఇష్టంగా చదివి, దృఢసంకల్పంతో అనుకున్న లక్ష్యాలన సాధించాలని తెలిపారు,కృషి, పట్టుదల క్రమశిక్షణ ఉంటే సాధించలేనిది ఏదీ లేదని అన్నారు విద్యార్థులకు 10వ. తరగతి పరీక్షలు అత్యంత కీలకమని, వార్షిక పరీక్షలు బాగా రాసి మంచి ర్యాంకుతో ఉత్తీర్ణత సాధించి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు జటిలమైన సబ్జెక్టులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రత్యేక దృష్టి పెట్టి, అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలని ఆయన సూచించారు, పరీక్షలు అంటే భయం లేకుండా నమ్మకంగా ఉండాలని, చదువుతోపాటు ఆరోగ్యం కూడా ముఖ్యమేనని అందుకు నాణ్యమైన పౌష్టిక ఆహారం తో పాటు సరిపడా నిద్ర కూడా పోవాలని తెలిపారు ,గత సంవత్సరం జిల్లాలో టాప్ మార్కులతో నిలిచిన టాపర్ లను ప్రేరణగా తీసుకొని ప్రతి ఒక్కరు ఉత్తమ మార్కులు సాధించాలని... దృఢ సంకల్పంతో నిరంతరం కృషి చేయాలని సూచించారు. అలాగే గత సంవత్సరము దేవరుప్పుల మండలంలో 546 ఉత్తమ మార్కులతో నిలిచారని, ఈసారి అంతకంటే ఎక్కువ మార్కులు సాధించాలన్నారు,వార్షిక పరీక్షలు తక్కువ సమయం ఉన్నందున, సమయాన్ని వృదా చేసుకోకుండా, పూర్తి సమయాన్ని చదువుకు కేటాయించాలని తెలిపారు. అలాగే ప్రతి రోజు చదవడంలో పాటు రాయడం చేయాలని,గత వార్షిక ప్రశ్న పత్రాలు మోడల్ పేపర్లను చవడం వల్ల సానుకూల దృక్పథం ఏర్పడుతుందని అన్నారు, గణితం వంటి క్లిష్టమైన అభ్యాసాల పట్ల ప్రత్యేక దృష్టిపెట్టి, సబ్జెక్టు పై పట్టు సాధించి, పదే పదే రాయడం చదవడం చేయాలని తెలిపారుముఖ్యంగా చేతి వ్రాత స్పష్టంగా ఉండేవిదంగా చూసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి దైర్యంగా, ఆత్మవిశ్వాసంతో విజయం సాధిస్తానని బలంగా ఉండాలని అన్నారు. విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.మండలంలో 10వ. తరగతి విద్యార్థులను ఒక్కొక్కరిగా వారూ ఎంచుకున్న లక్ష్యాలను, ఎన్ని మార్కులు సాధిస్తారు, వారు ఏమి కావాలి అనుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు, ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఆయన అందించారు.విద్యార్థులు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు తప్పక హాజరుకావాలని తెలిపారు, వివిధ కారణాలతో గైర్హాజరు కావద్దని, ఆలా అయితే సంవత్సరకాలం వృధా అవుతుందని విద్యార్థులకు ఉద్బోధించారు.సబ్జెక్టులలో డల్ గా ఉన్న విద్యార్థులను గ్రహించి వారికి ప్రత్యేక తరగతులను వహించి వారికి మెలుకువలు అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎ.యం.ఓ. శ్రీనివాస్, ఎంఈఓ జి కళావతి,మోటివేషన్ స్పీకర్ డా. వి. బ్రహ్మా రెడ్డి, హైకోర్టు అడ్వకేట్ ఈటూరు శ్రీనివాస్ రావు, దేవరుప్పుల సర్పంచ్ కృష్ణమూర్తి, కామారెడ్డి గూడెం సర్పంచ్ చింత రవి, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో కలెక్టర్

## జనగామ జిల్లా క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో అత్యధిక పథకాలు సాధించాలి

**జిల్లా స్థాయి సీఎం కప్ 2025 లో భాగంగా జనగామ జిల్లాలో పోటీలు**

**విద్యార్థులు చదువుకుంటూ, క్రీడలలో కూడా రాణించాలి**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 14(ప్రభాత ఉదయం):**


జిల్లా స్థాయి సీఎం కప్ 2025 లో భాగంగా జిల్లాలో మినీ స్టేడియం, ప్రెస్టన్, సోషల్ వెల్ఫేర్, ఇతర క్రీడా ప్రదేశాలలో వాలీబాల్ కబడ్డీ, చెస్ , క్యారమ్, యోగ , నెట్ బాల్ ఫుట్ బాల్, బేస్ బాల్ మొదలైన 26 క్రీడా విభాగాలలో పోటీలు నిర్వహించారు.. శనివారం ధర్మకంచ లోని మినీ స్టేడియం లో జరిగిన ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముఖ్య అతిది గా హాజరయ్యారు.ఈ సందర్భంగాక్రీడాకారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ యువత, విద్యార్థులు చదువుకుంటూ... క్రీడలలో కూడా రాణించాలన్నారు. క్రీడల ద్వారా కేవలం మానసిక ఉల్లాసమే కాకుండా...ఉన్నత చదువులకు, ఉద్యోగాలు పొందుటకు ప్రభుత్వం క్రీడల కోటా కింద ప్రత్యేకంగా క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తుందన్నారుఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని... తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతో పాటుగా క్రీడల యందు కూడా పాల్గొనుటకు ప్రోత్సహించాలన్నారు.జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులను రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు పంపిస్థామని... అక్కడ కూడా జనగామ జిల్లా క్రీడాకారులు అత్యధికంగా పథకాలు సాధించాలని కోరినారు. వివిధ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు.. కలెక్టర్ పథకాలను బహూకరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి, కే కోదండరాములు, ఎస్జిఎఫ్ సెక్రెటరీ, ఘోర్ సింగ్, వ్యాయామ దర్శకులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# గద్దెనెక్కేందుకు గుద్దులాట

**నెంబర్ గేమ్ కోసం బంపర్ ఆఫర్లు**

**మెజారిటీ లేని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో పార్టీల బేరసారాలు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 14, (ప్రభాత ఉదయం):**




తెలంగాణలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలు మరోసారి రాజకీయ పార్టీల ఆధిపత్యాన్ని, ప్రజల ప్రయోజనాలను నిర్లక్ష్యం చేసే విధానాలను బట్టబయలు చేశాయి. ప్రధాన పార్టీల్లో గద్దెనెక్కేందుకు గుద్దులాటలు ప్రారంభమయ్యాయి. మెజారిటీ లేని కార్పొరేషన్లు,మున్సిపాలిటీల్లో పీఠం దక్కించుకోవడం కోసం పార్టీలు గెలుపొందిన అభ్యర్థులతో బేరసారాలకు దిగుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు మరియు 7 మున్సిపల్ కార్పొరేషన్లలో జరిగిన ఈ ఎన్నికల్లో, కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాల్లో విజయం సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించింది, 1347 వార్డులు గెలుచుకుని 66 మున్సిపాలిటీల్లో స్పష్టమైన మెజారిటీ సాధించింది. 717 వార్డులలో గెలిచి 13 మున్సిపాలిటీల్లో బిఆర్ఎస్ పార్టీ పాగా వేసింది. 261 వార్డులలో బిజెపి, 256 వార్డులలో ఇండిపెండెంట్ అభ్యర్థులు గెలుపొందారు. అయితే 36 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో హంగ్ పరిస్థితి ఏర్పడింది. ఇండిపెండెంట్ కౌన్సిలర్లు మరియు ఎక్స్-ఆఫీషియో మెంబర్లు (ఎమ్మెల్యేలు, ఎంపీలు వంటివారు) కీలక పాత్ర పోషిస్తున్నారు, కానీ ఇది ప్రజల ఆకాంక్షలకు బదులు పార్టీల బేరసారాలకు వేదికగా మారుతోంది. ఈ హంగ్ మున్సిపాలిటీల్లో చైర్మన్ లేదా మేయర్ పీఠాలను కైవసం చేసుకోవడానికి పార్టీలు పడుతున్న పాట్లు విమర్శకు తావివ్వడమే కాకుండా, స్థానిక స్వపరిపాలన వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపుతున్నాయి. కాంగ్రెస్, బిఆర్ఎస్, బీజేపీ వంటి ప్రధాన పార్టీలు గెలిచిన కౌన్సిలర్లను ప్రలోభాల నుండి రక్షించేందుకు క్యాంపులకు తరలిస్తున్నాయి. ఉదాహరణకు, కరీంనగర్, నిజామాబాద్, మంచిర్యాల్ వంటి ప్రాంతాల్లో ఏ పార్టీకీ మ్యాజిక్ ఫిగర్ రాకపోవడంతో, ఇండిపెండెంట్ల మద్దతు కోసం తీవ్రమైన లాబీయింగ్ జరుగుతోంది. ఇది దొడ్డిదారి ప్రయోజనాలకు పెద్దపీట వేస్తుంది. పార్టీలు డబ్బు లేదా పదవులతో కౌన్సిలర్లను ఆకర్షిస్తున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా కాంగ్రెస్ హంగ్ మున్సిపాలిటీల్లో బేరసారాలు మొదలుపెట్టిందని ఆరోపించారు. అలాగని బిఆర్ఎస్ పార్టీ కూడా ఏం తక్కువ కాదు. ఆ పార్టీ నేతలు కూడా పలు మున్సిపాలిటీల్లో బేరసారాలకు దిగుతున్నారుని, క్యాంపు రాజకీయాలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ విమర్శలు చేస్తుంది. ఈ విషయాన్ని కాస్త విమర్శనాత్మకంగా చూస్తే, ఈ బేరసారాలు స్థానిక ప్రజాస్వామ్యానికి పెద్ద ముప్పు. మున్సిపాలిటీలు ప్రజల సమస్యలైన రోడ్లు, నీటి సరఫరా, శానిటేషన్ వంటివి పరిష్కరించేందుకు ఉద్దేశించబడ్డాయి. కానీ, హంగ్ పరిస్థితుల్లో పార్టీలు అధికారం కోసం మాత్రమే పోటీ పడుతున్నాయి. ఉదాహరణకు మున్సిపాలిటీలో ఇండిపెండెంట్లు కీలకమైనప్పుడు, పార్టీలు వారిని కొనుగోలు చేసే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇది ప్రజల ఓటు విలువను తగ్గిస్తుంది. మరోవైపు, ఎక్స్-ఆఫీషియో మెంబర్ల ఓట్లు (ఎమ్మెల్యేలు, ఎంపీలు) కూడా నిర్ణయాత్మకంగా మారుతున్నాయి, ఇది స్థానిక ఎన్నికలను రాష్ట్ర స్థాయి రాజకీయాలకు అనుసంధానం చేస్తుంది. ఫలితంగా, స్థానిక అభివృద్ధి నిర్లక్ష్యమవుతుంది. ఇటువంటి పరిస్థితులు కేవలం తెలంగాణకే పరిమితం కాదు. దేశంలో ఇది పరిపాటిగా మారిందని రాజకీయ విశ్లేషకులు చెబుతూనేన్నారు.ఇది రాజకీయాల్లో అవకాశవాదాన్ని ప్రోత్సహిస్తుంది. ప్రజాస్వామ్యంలో స్థానిక స్వపరిపాలన బలోపేతం కావాలంటే, హంగ్ పరిస్థితుల్లో రీ-పోలింగ్ లేదా ఇండిపెండెంట్ కమిషన్ నిర్వహణ వంటి సంస్కరణలు అవసరం. లేకపోతే, పార్టీల బేరసారాలు మాత్రమే మిగిలి అంతిమంగా ప్రజలు మోసపోతారు. ఈ ఎన్నికలు మనకు గుణపాఠం అధికారం కోసం పార్టీలు పడరాని పాట్లు పడి ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నాయి. ఓ వైపు ఎన్నికల కమిషన్ అవలంబిస్తున్న విధానాలు ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి అనే విమర్శలు దేశ వ్యాప్తంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అభ్యర్థుల గెలుపు దగ్గర నుంచి మేయర్, ఛైర్మన్ పదవి ఎన్నికలను కూడా ప్రలోభాలకు దూరంగా ఉండేలా పర్యవేక్షణ చేయాలని ప్రజాస్వామ్యవాదులు కోరుతున్నారు.



## వినియోగదారులకు నాణ్యమైన దుస్తులను, అందుబాటు ధరలలో అందించాలి

**టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్**

**కూకట్ పల్లి, ఫిబ్రవరి 14 (ప్రభాత ఉదయం)**

వినియోగదారుల మనసు చూరాగొనేలా వ్యాపార నిర్వహణ ఉండాలని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. బేగంపేట డివిజన్ ప్రకాష్ నగర్ లో ఇంతియాజ్, మున్వర్అలీ లు నూతనంగా ఏర్పాటు చేసిన డెక్కన్ గార్మెంట్స్ షోరూమ్ ను శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక లావాపేక్ష లేకుండా వినియోగదారులకు అందుబాటు ధరలలో ఉండేలా చూడాలని, దీంతోపాటు నాణ్యమైన దుస్తులను అందిస్తే త్వరితగతిన వ్యాపార అభివృద్ధి జరుగుతుందని సూచించారు. నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రమేష్, రమాదేవి, అరుణ్, సృజిత్ గౌడ్, కరుణాకర్, శ్రీనివాస్ రెడ్డి, టోచర్, నరేష్, బాబు, పర్వేజ్, జాను తదితరులు పాల్గొన్నారు.



## గద్వాల మున్సిపల్ ఎన్నికల అక్రమాలపై ఏకమైన గద్వాల విపక్షాలు

**అధికారుల తప్పిదాలపై న్యాయ పోరాటం చేస్తాం....**

**కాంగ్రెస్ ప్రభుత్వానికి గద్వాల మున్సిపల్ ఎన్నికలు చెంప పెట్టు**

**దనం,మద్యం,సీడ్ మాఫియాకు వ్యతిరేకంగా నిలబడ్డ గద్వాల ప్రజలు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 14(ప్రభాత ఉదయం)**

ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పూర్తి సహకారంతో 8వ వార్డ్ బి ఆర్ ఎస్ అభ్యర్తి జయమ్మ కోటేష్ ను ఓడించిన అధికారులు మద్యం ఏరులై పారించిన డబ్బుల మూటలు కుమ్మరించిన సీడ్ మాఫియా దేగల్లా ప్రజలను బయపెట్టిన గద్వాల ప్రజలు ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డికి కర్రు కాల్చి వాత పెట్టారు.బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పార్టీలు మారినంత సులభంగా ప్రజల మనసులను మార్చలేరని విషయాన్ని అయన తెలుసుకోవాలి.. ముఖ్యమంత్రి తొండల్ రెడ్డికి అయన సంకలో దూరిన గద్వాల జెండాల్ రెడ్డికి రాబోయే రోజుల్లో విపక్షాలన్ని ఒక్కటై బుద్ది చెపుతాం.గద్వాలను అన్ని రకాలుగా కబాలించాలని ఈ దోపిడిదారులు చూసినా ప్రజలు మాత్రం ఎమ్మెల్యే కు వ్యతిరేంగా నిలబడ్డారు..రాబోయే రోజుల్లో ప్రజల మద్దతుతో తిరగ బడతాం తరిమి కొడతాం....

# బ్రహ్మోత్సవాలకు సకల సౌకర్యాలు

## ప్రత్యేక ఆర్టీసీ బస్సులు.

## పారిశుధ్యంకు అత్యంత ప్రాధాన్యత... జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 14 (ప్రభాత ఉదయం):**



జిల్లా లోని పాలకుర్తి శ్రీ సోమేశ్వర శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా, సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్అన్నారు.పాలకుర్తి శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 14 నుండి 18 వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై దేవస్థానం, విద్యుత్, పోలీస్, పంచాయతీ, ఆర్డబ్ల్యూఎస్, ఇతర అధికారులతో శనివారం దేవస్థానం కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాల కు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున..అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలన్నారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భద్రత చర్యలతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అలాగే వాహనాలను పార్కింగ్ ప్రదేశాల్లో నిలిచే విధంగా చూడాలని సూచించారు. బ్రహ్మోత్సవాలు జరిగే ప్రదేశాల్లో 32 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీస్ శాఖ తెలుపగా.. అవసరమైతే అదనంగా కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు.పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని... పారిశుద్ధ కార్మికులకు డ్రెస్ కోడ్ తో పాటు దశలవారీగా విధులు కేటాయించాలని, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసి వాటి నిర్వహణకు సిబ్బందిని నియమించాలని కలెక్టర్ సూచించారు.పరిసర ప్రాంతాల్లో చెత్త బుట్టలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని తెలిపారు,వేసవి సమీపిస్తున్నందున భక్తులకు తాగునీరు సమస్యలు ఉత్పన్నం కాకుండా భక్తులకు సరిపడా నాణ్యమైన త్రాగునీరు అందించాలని తెలిపారు. అలాగే సమీప వాటర్ ట్యాంకులలో క్లోరినేషన్ చేయాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు.బ్రహ్మోత్సవాలకు నిరంతరం విద్యుత్ సరఫరాకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అవసరమైన ప్రదేశాల్లో అదనపు ట్రాన్స్ఫార్లను అమర్చుకోవాలని ఆలయ పరిసరాల్లో, రహదారిలో ఎక్కడైనా విద్యుత్ వైర్లు క్రిందికి ఉంటే వాటిని సరిచేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. వైద్య సదుపాయాల్లో భాగంగా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వాటిలో తగినన్ని మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు నిల్వ ఉంచాలని తెలిపారు, అలాగే అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకునే విధంగా అంబులెన్స్లను సిద్ధంగా పెట్టాలని సంబంధిత శాఖ కు సూచించారు,తరలివచ్చే భక్తులకు లడ్డు, పులిహోర ప్రసాదాలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రసాదాల నాణ్యతను ఫుడ్ ఇన్స్పెక్టర్ ద్వారా పరీక్షించాలని తెలిపారు.భక్తులకు స్వామి వారి దర్శనానికి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లను,పోలీస్, పారిశుద్ధ్యం శాఖలవారు ప్రత్యేక కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి , కంట్రోల్ రూమ్ ల ఫోన్ నెంబర్లను భక్తులకు కనిపించే విధంగా ప్రదర్శింపచేయాలని, 24 గంటలపాటు పనిచేసే విధంగా సన్నద్ధం కావాలని కలెక్టర్ సూచించారు, బ్రహ్మోత్సవాల విధులు నిర్వహించే ప్రతి ఒక్కరికి గుర్తింపు కార్డులను జారీ చేయాలని కలెక్టర్ తెలిపారు.భక్తులకు ఏమైనా సమస్యలు ఉంటే తెలియపరిచే విధంగా ఫిర్యాదుల రూమును ఏర్పాటు చేయాలని తెలిపారు.దేవస్థానం పరిసరాలలో ఫైర్ ఇంజన్ సిద్ధంగా ఉంచాలని, పరిసర ప్రాంతాలలో ముమ్మరంగా ఫాగింగ్ చేయాలని, భక్తుల రవాణా సౌకర్యం కల్పించుటకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు.వృద్ధుల సౌకర్యం కోసం వీల్ చైర్ లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు.సోమేశ్వర శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి మహాశివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ దేవస్థానం పరిసర ప్రాంతాల్లో క్యూలైన్లను లడ్డు తయారు చేసే రూములను పోలీస్ కంట్రోల్ రూమ్ డిఆర్డిఓ ద్వారా ఏర్పాటు చేసిన వస్తువుల విక్రయ కేంద్రాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు ,సలహాలు ఇచ్చారు.ఈ సమావేశంలో ఆలయ ఈఓ లక్ష్మి ప్రసన్న, డిఆర్డిఓ వసంత, ఏసీపి నర్సయ్య, విద్యుత్ శాఖ డిఈ సారయ్య, ఎంపీడీవో వేదవతి, ఆర్డబ్ల్యూఎస్ డీఈ నవీన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# పుర పీఠం దక్కేదెవరికో...?

## ఇండిపెండెంట్‌లకు బంఫర్ ఆఫర్ ఇచ్చినట్లు ఆరోపణలు

## గద్వాల్‌లో వేడెక్కిన రాజకీయం

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 14 ( ప్రభాత ఉదయం)**

గద్వాల మున్సిపాలిటిలో క్యాంపు రాజకీయాలు ఒక్కసారి వేడెక్కాయి. గద్వాల మున్సిపాలిటి చైర్మన్ జనరల్ మహిళకు కేటాయించారు. మొత్తం 37 వార్డులకు గాను కాంగ్రెస్ కు 16, బీఆర్ఎస్ కు 11, బీజేపీకి 7, ఎంఐఎం 1, స్వతంత్రులు ఇద్దరు గెలుపొందారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు కావాల్సిన మ్యాజిక్ ఫిగర్ 19కాగా ప్రస్తుతం ఏ ఒక్క ప్రధాన పార్టీకి మెజార్టీ స్థానాలు దక్కకపోవడంతో అందరి చూపు 29, 32 వార్డుల నుంచి గెలుపొందిన స్వతంత్ర అభ్యర్థులపై ఫోకస్ పెట్టారు. శుక్రవారం ఎన్నికల ఫలితాల వెలువడిన నేపథ్యంలో స్వతంత్ర అభ్యర్థులను హైడ్రామా మధ్య ప్రత్యేక వాహనాల్లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి క్యాంపు కార్యాలయానికి తరలించి అక్కడ మంతనాలు జరిపినట్లు గుసగుసలు. వారికి ప్రత్యేక బంపర్ ఆఫర్ లు ఇచ్చి హైదరబాద్ కు తరలించినట్లు సమాచారం. మరో వైపు బీఅర్ఎస్, బీజేపీ పార్టీలు క్యాంపు రాజకీయాలు మొదలుపెట్టాయి. ఇద్దరి మధ్య సయోధ్య కుదిరితే మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ కైవసం చేసుకునేందుకు వేగంగా పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఇండిపెండెంట్ కౌన్సిలర్ లకు కీలక పదవులు ఇస్తామని, మాకు మద్దతు తెలుపాలని కోరినట్లు తెలుస్తోంది. ఈనెల 16న మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో గెలుపొందిన కౌన్సిలర్లు ఎటు వైపు మొగ్గు చూపుతారో వేచి చూడాలి.

**ఈనెల 16న చైర్మన్ ఎన్నిక**

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఈనెల 16న మేయర్, మున్సిపల్ చైర్మన్ల ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు నిర్వహించే ప్రత్యేక సమావేశంలో కొత్తగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారంతో పాటు, పరోక్ష పద్ధతిలో కీలక పదవుల భర్తీ ప్రక్రియ పూర్తికానుంది. దీంతో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకున్న కాంగ్రెస్ బీఅర్ఎస్ పార్టీలు ఎవరికివారే ఎత్తుకు పై ఎత్తు వేస్తూ క్యాంపు రాజకీయాలు నడుపుతున్నారు. ఎలాగైన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ దక్కించుకోవడానికి వేగంగా పావులు కదుపుతున్నారు. స్వతంత్రులను తమ వైపు తిప్పికుంటే మున్సిపల్ పీఠం దక్కించుకోవడానికి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు జిల్లా కేంద్రంలో జోరుగా చర్చ నడుస్తోంది.

**క్యాంప్ రాజకీయాలు షురూ..**

గద్వాల్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ స్థానం రసవత్తరంగా ఎన్నిక కానుంది. 37 వార్డుల గాను చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు కావాల్సిన మ్యాజిక్ ఫిగర్ 19కాగా ప్రస్తుతం ఏ ప్రధాన పార్టీకి మెజార్టీ స్థానాలు దక్కలేవు. కాంగ్రెస్ కు 16, బీఆర్ఎస్ కు 11, బీజేపీకి 7, ఎంఐఎం 1, స్వతంత్రులు ఇద్దరు గెలుపొందారు. దీంతో కీలకంగా వ్యవహరించనున్న 29, 32 వార్డుల నుంచి గెలుపొందిన స్వతంత్ర అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ తమ వైపు లాక్కునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా క్యాంప్ రాజకీయాల ను ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ తో పాటు బీజేపీ, బీఆ ర్ఎస్ కౌన్సిలర్లు వారి అధినేతల ఆధ్వర్యంలో వేర్వేరు గా హైదరాబాదుకు క్యాంపుకు తరలి వెళ్లారు. ఈ క్యాంపులోనే చైర్మన్, వైస్ చైర్మన్ ల కేటాయింపు వ్యవహారం కొలిక్కి వచ్చే అవకాశాలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీకి ఇండిపెండెంట్ కౌన్సిలర్ లు మద్దతు ఇస్తారా లేదా బీజేపీ పార్టీ ఇటు బీఆర్ఎస్ పార్టీకి సపోర్ట్ చేస్తుందా అనేది మరో రెండు రోజుల్లో తేలనున్నది. శుక్రవారం మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుక్షణమే ఇండిపెండెంట్ కౌన్సిలర్ లను గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆద్వర్యంలో ప్రత్యేక వాహనంలో హైదరబాద్ కు మకాం మార్చినట్లు పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. వీరితో పాటు మరో ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు పట్టణంలో జోరుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఒక వేళ బీఆర్ఎస్ పార్టీ విప్ జారీ చేస్తే ఆ పార్టీకి చెందిన కౌన్సిలర్ లు మరో పార్టీకి మద్దతు ఇచ్చే అవకాశం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మున్సిపల్ పీఠం చేజిచుకోవడానికి బీఅర్ఎస్ బీజేపీ పార్టీలు మంతనాలు జరుపుతున్నట్లు, వారికి ఇండిపెండెంట్ లు మద్దతు తెలపకున్నా ఎక్స్ అఫిషియోతో చైర్మన్ పీఠం కైవసం చేసుకునే అవకాశం పుష్కలంగా ఉన్నాయని విశ్లేషకులు పేర్కొన్నారు.



## మున్సిపల్ ఎన్నికల కాంగ్రెస్ ప్రభంజనం టెంపోను గ్రేటర్‌లో కొనసాగిస్తాం

### బాలానగర్ కాంగ్రెస్ నేతలు

**కూకట్ పల్లి, ఫిబ్రవరి 14 (ప్రభాత ఉదయం)**

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన ప్రభంజనంను అంతే ప్రభంజనంతో త్వరలో జరగబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో సాధిస్తామని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి అన్నారు. శనివారం బాలానగర్ డివిజన్ లోని ఇందిరానగర్ లో బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధు గౌడ్ ఆధ్వర్యంలో డివిజన్లోని బూత్ స్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపట్ల బూత్ స్థాయి కార్యకర్తలతో విస్తృతంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ ప్రతీ ఒక్క బూత్ స్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేసే విధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయి కార్యకర్త తనకు అప్పజెప్పిన పనులను తూచా తప్పకుండా పాటించాలని అన్నారు. ముందుగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను, కాంగ్రెస్ పార్టీ అభిమానులను, సానుభూతి పరులను తక్షణమే గుర్తించి వివరాలను సేకరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ యుద్ధం జరుగుతున్న సమయంలో సైన్యంలో సైనికులు ఏవిధంగా నైతె విరచిత పోరాటం చేస్తూ ముందుకు సాగుతారో అదే విధంగా కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి కార్యకర్తలు కూడా అలాగే వీరోచితంగా కష్టపడాల్సిన అవసరం ఉందన్నారు. ఒక మాటలో చెప్పాలంటే సర్జికల్ స్ట్రైక్ ఏవిధంగా జరిగిందో అదేవిధంగా బూత్ స్థాయి కాంగ్రెస్ కార్యకర్తలు సర్జికల్ స్ట్రైక్ చెయ్యాలని పిలుపునిచ్చారు. కష్టపడితే విజయం తథ్యమని, ఇప్పటి నుండే కార్యాచరణను తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు బంధిగా నరసింహ, మైనారిటీ నాయకులు అడ్వకేట్ హుస్సేన్, ఆకుల నరేందర్ ముదిరాజ్, మట్టే ప్రసన్న కుమార్, ఓబీసీ నరేష్, మాదరీ శ్రీనివాస్, ముప్పురి బాలరాజు, సోనూ అర్షద్, గజానంద్ శేఖర్, జిల్లా శివ, ఇమ్రాన్, ముస్తఫా, సోహైల్, అక్రమ్, రుక్కుద్దీన్, జమ్మూ, శ్రీకాంత్, పీటర్, రాము, షేక్ సావుద్ తదితరులు పాల్గొన్నారు.



## నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్స్‌కు హార్థిక శుభాకాంక్షలు తెలిపిన జిల్లా మంత్రి

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 13(ప్రభాత ఉదయం)**

గద్వాల మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలుపొందిన కౌన్సిలర్స్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి . సమక్షంలో జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు ని జిల్లా డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్స్ కు రాష్ట్ర మంత్రి అభినందనలు తెలిపి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ .... గద్వాల మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్స్ చే గద్వాల మున్సిపాలిటీ చైర్మన్ మున్సిపల్ వైస్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు చైర్మన్ వైస్ చైర్మన్గా ఎన్నుకోవడం జరుగుతుంది తెలిపారు.ప్రజా పాలన ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో గద్వాల నియోజకవర్గం గద్వాల మున్సిపాలిటీ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తూ ఎన్నికలలో మీరు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చే విధంగా నా వంతు గద్వాల రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే విధంగా నా వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రజా పాలన పరిపాలనలో కలిసికట్టుగా పని చేద్దాం బంగారు తెలంగాణ నిర్మాణానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

## మేయర్ పదవిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోం

### సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వెల్లడి

**హైదరాబాద్, ఫిబ్రవరి ఫిబ్రవరి 14(ప్రభాత ఉదయం)**

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో కీలకంగా మారింది. ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీపీఐకి బేషరతుగా మద్దతు ప్రకటించడం రాజకీయంగా సంచలనంగా మారింది. కొత్తగూడెం కార్పొరేషన్‌లో సీపీఐ అత్యధిక స్థానాలు గెలుచుకున్న నేపథ్యంలో, తాము మద్దతు ఇస్తామని కేటీఆర్ స్వయంగా ఫోన్ చేసి తెలిపారని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. మీరు గెలిచారు కాబట్టి మీకు మద్దతు ఇస్తాం అని కేటీఆర్ చెప్పినట్లు ఆయన ధృవీకరించారు.